సాక్షి
ఆదిలాబాద్
సోమవారం | 15 | సెప్టెంబర్ | 2025



జోహార్ వెంకటి 8లో▸

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టు టెక్నికల్ టీమ్, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడి వెంకటి అంత్యక్రియలు చంద్రవెల్లిలో ముగిశాయి.



రోడ్లపైనే నిరీక్షణ..

ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. బస్టాండ్ ఉన్నా బురదమయం కావడంతో బస్సులు లోనికి వెళ్లని దుస్థితి. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో జిల్లా విద్యార్థి ప్రతిభ



అవార్డు అందుకుంటున్న సహిష్ణుత్

ఆదిలాబాద్‌టౌన్: సరస్వతి శిశుమందిర్ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ ఆదివారం కామారెడ్డిలో నిర్వహించారు. ఇందులో ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి పాలపెళ్లి సహిష్ణుత్ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం తెలిపారు.

ముగిసిన లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్ష

కైలాస్‌నగర్: జిల్లాలో లైసెన్స్‌డ్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో రెండు సెషన్‌లో పరీక్ష నిర్వహించారు. ఉదయం నిర్వహించిన థియరీ పరీక్షకు 83 మందికి గాను 82 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్లాటింగ్ పరీక్షకు 105 మందికి గాను 104 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్, అబ్జర్వర్ కె.రాజలింగు పర్యవేక్షించారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న భూపాల్

ఆదిలాబాద్‌టౌన్: వైద్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో యూనియన్ తృతీయ మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయిస్తుందని, పనికి తగ్గ వేతనం చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఆధార్ బేస్డ్ అటెండెన్స్ తొలగించాలని డిమాండ్ చేశారు. రెండో, అర్బన్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ ఉద్యోగుల జీవోను వెంటనే రిలీజ్ చేయాలన్నారు. రిమ్స్ ఉద్యోగుల వేతనాల్లో కాంట్రాక్టర్ కోత విధించకుండా నేరుగా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశ్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశన్న, కిరణ్, స్వామి, పుష్పల, విద్య, నాగనాథ్, సురేందర్, శ్రీనివాస్, తులసీ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

- జిల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని జిల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో జిల్లాలోని 20 వసతి గృహాలకు సంబంధించి పలువురు పిల్లల తల్లిదండ్రులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తూ అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు గాను ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ నం 1 పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, వసతి గృహ సంక్షేమాధికారులు గంగాదేవి, రాధ, గంగమ్మ, సంజన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ'

ఆదిలాబాద్‌టౌన్: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించి నిజమైన పోరాట చరిత్రను తప్పుదోవ పట్టిస్తుందని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హమాలీ సంఘ భవనంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాస్తవాలు- వక్రీకరణ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సాయుధ పోరాటంలో కనీస పాత్రలేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విలీనమని, విమోచనమని చరిత్రను వక్రీకరించి చెబుతున్నారని పేర్కొన్నారు. టీకానంద్, కార్తీక్, అశోక్, శ్రీనివాస్, రాజేందర్, మహేశ్ పాల్గొన్నారు.

చెక్కు చెదరలే..

- చారిత్రక సాక్ష్యాలు.. ఈ నిర్మాణాలు
- నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు ఆనవాళ్లు
- నేడు ఇంజినీర్స్ డే

ఉమ్మడి జిల్లాలో నిజాం, నిమ్మల రాజుల హయాంలో నిర్మించిన పలు కట్టడాలు చారిత్రక సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. శతాబ్దాలు దాటినా చెక్కు చెదరని ఆ నిర్మాణాలు నాటి ఇంజినీర్ల ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నాయి. భారీ వరదలను సైతం తట్టుకుని నిలిచిన కడెం ప్రాజెక్టు ఇందులో ప్రత్యేకం. ఇక ఆదిలాబాద్‌లోని మావల చెరువు గ్రావిటీ స్పెషల్‌గా.. ఖానాపూర్‌లోని సదర్‌మాట్ ఆనకట్ట వారసత్వ కట్టడంగా నిలుస్తున్నాయి. నిర్మల్ బురుజులు, కోటలు, నస్పూర్‌లోని గడి, ఆసిఫాబాద్‌లోని జిల్లా జైలు నాటి ఇంజినీర్ల నైపుణ్యాన్ని చాటుతున్నాయి. నేడు ఇంజినీర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

వరదలను తట్టుకుని నిలిచిన 'కడెం'



కడెం ప్రాజెక్ట్

కడెం: నిర్మల్, మంచిర్యాల జిల్లాల వరప్రదాయిని కడెం ప్రాజెక్ట్. 18 గేట్లున్న దీని పూర్తి స్థాయి నీటి మట్టం 700 అడుగులు. నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, పూడిక పేరుకుపోవడంతో ప్రస్తుతం దీని సామర్థ్యం 4.699 టీఎంసీలు మాత్రమే. కుడి, ఎడమ కాలువల ద్వారా నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట్, హాజీపూర్ మండలాల్లోని 68,150 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందిస్తుంది. గోదావరికి ఉపనది అయిన కడెం నదిపై 1949లో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. 1958లో 9 జర్మనీ టెక్నాలజీ గేట్లతో నిర్మాణం పూర్తయింది. 1958 ఆగస్టులో వచ్చిన భారీ వరదలకు ప్రాజెక్ట్ తెగిపోయింది. అవుట్‌ఫ్లో సామర్థ్యం పెంచేందుకు 1969లో మరో 9 ఇండియన్ గేట్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి 1995, 2022, 2023లో ప్రాజెక్ట్ సామర్థ్యానికి మించి భారీ స్థాయిలో(5లక్షల క్యూసెక్కులకు పైగా) ఇన్‌ఫ్లో వచ్చి గేట్లపై నుంచి వరద పారినా ఏమీ కాలేదు. అప్పటి ఇంజినీర్ల నైపుణ్యంతో నేటికీ కడెం ప్రాజెక్ట్ చెక్కుచెదరకుండా నిర్మల్, మంచిర్యాల జిల్లాల రైతాంగానికి అండగా నిలుస్తోంది.

అప్పటి ఇంజినీర్ల గొప్పతనమే..

కడెం చాలా పురాతన ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్‌ను డిజైన్ చేసిన ఆనాటి ఇంజినీర్ల ప్రతిభతో నేటికీ ఆయకట్టుకు సాగునీరందిస్తోంది. భారీ వరదలనూ తట్టుకుని నిలవడం అప్పటి ఇంజినీర్ల గొప్పతనమే.

– ప్రవీణ్, ఈఈ, కడెం

మావల @ గ్రావిటీ స్పెషల్



గ్రావిటీ ద్వారా నీరందించే మావల చెరువు



ఆదిలాబాద్‌లోని ఫిల్టర్‌బెడ్

కైలాస్‌నగర్: నిజాం హయాంలో ఆదిలాబాద్ పట్టణానికి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసేలా చేపట్టిన పైపులైన్, ఫిల్టర్‌బెడ్ నిర్మాణాలు నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

గ్రావిటీ ద్వారా నీటి సరఫరా

నిజాం హయాంలో ఆదిలాబాద్ వాసుల దాహార్తి తీర్చేందుకు పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో గల మావల అటవీ ప్రాంతంలో 60 ఎకరాల విస్తీర్ణంలో చెరువు నిర్మించారు. 1925లో నిర్మాణాన్ని ప్రారంభించగా 1948లో అందుబాటులోకి వచ్చింది. భారీ వరదలు, తుపానులు వచ్చినా తట్టుకుని నిలబడేలా కట్టను నిర్మించారు. ఇప్పటికీ చిన్నపాటి లీకేజీలు సైతం లేకపోవడం పనుల నాణ్యతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా చెరువు నుంచి ఫిల్టర్‌బెడ్ వరకు భూగర్భంలో నిర్మించిన పైపులైన్ ఔరా అనిపిస్తోంది. గ్రావిటీ ద్వారా వచ్చే చెరువు నీరు ఆదిలాబాద్ పట్టణంలోని 25 శాతం జనాభాకు తాగునీటి ఇబ్బందులను దూరం చేస్తోంది.

ఫిల్టర్‌బెడ్

మావల చెరువు నుంచి వచ్చే నీటిని శుద్ధిచేసేలా కలెక్టరేట్ పక్కన పదెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఫిల్టర్‌బెడ్ సైతం ప్రత్యేకంగా నిలుస్తోంది. చెక్‌డ్యాంల ద్వారా మూడు దశల్లో శుద్ధి చేసిన జలాన్ని పంప్‌హౌస్ నుంచి పట్టణంలోని ట్యాంకులకు విడుదల చేస్తారు. వాటి ద్వారా ఇళ్లకు సరఫరా అవుతోంది. దీనిని లండన్‌కు చెందిన ది క్యాండీ ఫిల్టర్ కంపెనీ 1947లో నిర్మించడం గమనార్హం.

120 ఏళ్ల 'నస్పూర్ గడి'

నస్పూర్: మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణ పరిధిలోని విలేజ్ నస్పూర్‌లో 120 ఏళ్ల క్రితం నిర్మించిన చారిత్రక గడి నాటి పాలనకు సాక్ష్య ంగా నిలుస్తోంది. 1905లో నిజాం హయాంలో నస్పూర్‌కు చెందిన జీవీ వంశీయులు ఇనుము, కాంక్రీట్ వాడకుండా కేవలం డంగుసున్నంతో రెండంతస్తుల భవనం నిర్మించారు. చుట్టూ నాలుగెకరాల ప్రహరీ సైతం డంగుసున్నంతోనే నిర్మించడం ప్రత్యేకత. ఈ గడి కేంద్రంగా నిజాం సంస్థానాధీశులు లక్సెట్టిపేట, ఇందారం, జన్నారం, తపాలాపూర్, మంథని, పెద్దపల్లి, భూపాలపల్లి, మహారాష్ట్రలోని సిరొంచ, చంద్రపూర్, మధ్యప్రదేశ్‌లోని బస్తర్ వరకు ఇక్కడి నుంచే పాలన కొనసాగించే వారు. స్వాతంత్ర్యానంతరం ఈ కట్టడం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. కొద్ది నెలల క్రితం హెరిటేజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆధునికీకరించారు.





గోదావరిపై నిర్మించిన సదర్‌మాట్ ఆనకట్ట

వారసత్వ కట్టడంగా 'సదర్‌మాట్'

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి సమీపంలోగల గోదావరిపై 1891లో నిజాం పాలనలో ఫ్రెంచ్ ఇంజినీర్ జేజే ఒటలే సదర్‌మాట్ ఆనకట్ట నిర్మించారు. ఇది రెండు మండలాల్లోని సుమారు 15వేలకు పైగా ఎకరాలకు పైసా ఖర్చు లేకుండా 130 ఏళ్లుగా సాగునీరు అందిస్తోంది. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని ఆ రోజుల్లో పూర్తిగా రాళ్లతో గోదావరికి అడ్డంగా కట్టారు. దీనికి కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. వీటి ద్వారా నీటిని విడుదల చేసేందుకూ ఎలాంటి టెక్నాలజీ, ఖర్చు అవసరం లేదు. చెరువు తూములాగే గేట్లు మనుషులే ఎత్తవచ్చు. అప్పట్లో వర్షాధారంగా నిండే నీటితోనే పంటలకు నీరందించేలా దీన్ని నిర్మించడం విశేషం. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయిన తర్వాత 1985–86వరకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సదర్‌మాట్‌కు నీళ్లు వచ్చాయి. ఆ తర్వాత నుంచి ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆయకట్టు రైతులే పోచంపాడ్ వరకు వెళ్లి శ్రీరాంసాగర్ నుంచి నీళ్లు పోరాడి తెచ్చుకోవాల్సి వస్తోంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విషయం తెలుసుకుని స్వయంగా తానే సదర్‌మాట్ వరకు వచ్చారు. నిపుణులతో సర్వే చేయించి సదర్‌మాట్ కాలువ, బ్యారేజీ నిర్మాణానికి రూ.386కోట్లు మంజూరు చేశారు. కాగా, ఆయన మరణానంతరం బ్యారేజీ నిర్మాణంలోనూ మార్పులు జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం ఎగువనున్న మామడ మండలం పొన్కల్ వద్ద గోదావరిపై సదర్‌మాట్ నూతన బ్యారేజీ నిర్మిస్తోంది. కాగా, కేంద్రప్రభుత్వం మూడేళ్ల క్రితం సదర్‌మాట్‌ను వారసత్వ సాగునీటి కట్టడంగా గుర్తించింది.

నిర్మాణ కౌశలం.. నిమ్మల



ఖిల్లాగుట్టపై నిర్మాణం

నిర్మల్: ఎప్పుడో 450 ఏళ్ల కిందట నిర్మితమైన నిర్మల్ (నిమ్మల) జిల్లా కేంద్రం లోపల, చుట్టూ బురుజులు, గఢ్‌లు ఇప్పటికీ నాటి ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని చాటుతున్నాయి. నిమ్మనాయుడు నిర్మించిన అనంతరం కుంటి వెంకట్రాయుడు, శ్రీనివాసరావుల కాలంలో నిమ్మల చాలా నిర్మాణాలకు నోచుకుంది. శత్రువులతో పాటు, దొంగల దాడుల నుంచి రక్షణ కోసం పటిష్టమైన రక్షణ నిర్మాణాలు చేపట్టారు. మూడంచెల రక్షణ వ్యవస్థను నిర్మించారు. వీటిలో ఖిల్లాగుట్ట, కురన్నపేటబురుజు, బత్తీస్‌గఢ్, రాణి (వేంకటేశ్వర)గఢ్, గజ్‌గఢ్, ఇబ్రహీంగఢ్, శ్యామ్‌గఢ్, సోన్‌గఢ్, చిట్టిగఢ్, బీరవెల్లి గఢ్, వడూర్ (వైడూర్యపురం) గఢ్ వంటివి ఉన్నాయి.

నిమ్మల నిర్మాణం అద్భుతం



తెలంగాణలో ఓరుగల్లు, గోల్కొండ రాజ్యాలకు ఏమాత్రం తీసిపోని విధంగా నిమ్మల రాజ్యం నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ గోండు, ఫ్రెంచ్‌తో పాటు స్థానిక రాజ్యాల నిర్మాణశైలిలో కట్టడాలు ఉండటం విశేషం. సారంగపూర్ మండలం జౌళి నుంచి నిర్మల్ సమీపంలోని వెంకటాపూర్ వరకు 16 గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. ఇవన్నీ ఎత్తు, వాలు ఆధారంగా గొలుసుకట్టుతో నిర్మించడం విశేషం.

– డా.కట్కం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్

నిజాం నాటి ఆసిఫాబాద్ జైలు



ఆసిఫాబాద్‌లోని జైలు ఇదే..

ఆసిఫాబాద్: 1916లో అప్పటి జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌లో గల జన్కాపూర్‌లో ఐదెకరాల్లో జైలు నిర్మించారు. నిజాం హయాంలో దీనిని పూర్తిగా డంగుసున్నంతో నిర్మించారు. ఇందులో మూడు బారక్‌లు ఉన్నాయి. సుమారు 200 మంది ఖైదీలు ఉండేలా భవన నిర్మాణం చేపట్టారు. అనంతరం కొన్నేళ్లపాటు మూసి ఉండగా మరమ్మతులు చేసి 1991 మార్చి 15న అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఎంజీ గోపాల్ తిరిగి ప్రారంభించారు. 17 ఏళ్లపాటు తిరిగి జిల్లా జైలుగా కొనసాగగా అనంతరం ఆసిఫాబాద్ జిల్లా జైలును 2008లో ఆదిలాబాద్‌కు తరలించి, ఇక్కడి జైలును స్పెషల్ సబ్ జైలుగా మార్చారు.

గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడిగా సాయి చైతన్య



డైరెక్టర్లు, మద్దతుదారులతో సాయి చైతన్య

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడిగా సాయి చైతన్య ఎన్నికయ్యారు. జిల్లా నూతన పాలకవర్గ ఎన్నిక భుక్తాపూర్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి బి.మోహన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్ష పదవీ కోసం సాయి చైతన్య, మేకల రవికాంత్, ఉపాధ్యక్ష పదవి కోసం కేమ లక్ష్మణ్, కెంద రాకేశ్ పోటీపడ్డారు. బ్యాలెట్ విధానంలో నిర్వహించిన ఎన్నికలో సదరు అభ్యర్థులకు ఆరేసి ఓట్లు చొప్పున సమానంగా వచ్చాయి. లాటరీ విధానంలో సాయి చైతన్య, కేంద రాకేశ్‌ను అదృష్టం వరించింది. ఇరువురు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికై నట్లుగా డీసీవో ప్రకటించారు. అనంతరం మద్దతుదారులు, యాదవ కులస్తులు, డైరెక్టర్లు వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాగా సంఘం డైరెక్టర్లుగా మేకల రవికాంత్, కేమ లక్ష్మణ్, వై.కిష్టయ్య, జి.వేణుగోపాల్, అసుర రమేశ్, పాత దేవన్న, గొర్ల రాజన్న, కేమ ఊషన్న, జి.వెంకటేశ్, బి.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం



ఉపాధ్యాయులను సన్మానించిన తుమ్మ లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం అన్నారు. పట్టణంలోని హిందీ హైస్కూల్‌లో ఇటీవల పదోన్నతులు పొందిన, ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న టీచర్లను ఆదివారం శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని చెప్పడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. ఏ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడు అదే సబ్జెక్టు టెట్ రాసే వీలు ఉండాలని పేర్కొన్నారు. అర్హత మార్కుల్లో కులాల వారీగా కాకుండా అందరికీ 40 శాతం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలెందర్ రెడ్డి, బలిరాం జాదవ్, గంద్రత్ నారాయణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శిథిలాల తొలగింపు



శిథిలాలను తొలగిస్తున్న కూలీలు

కైలాస్‌నగర్: కలెక్టరేట్ భవనానికి సంబంధించిన శిథిలాల తొలగింపు ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. కార్యాలయానికి సంబంధించి ఏ-సెక్షన్ బాల్కనీ పైఅంతస్తు ఈనెల 11న ఒక్కసారిగా కుప్పకూలిన విషయం విదితమే. ఈ మేరకు శిథిలాల తొలగింపు ప్రక్రియను ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కార్యాలయంలోకి జేసీబీ, వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో కూలీల ద్వారా తొలగింపజేస్తున్నారు.

ముగిసిన 'మీనం' టెండర్

- రెండు బిడ్లకు ఆమోదం
- పరిశీలనే కీలకం
- త్వరలోనే క్షేత్రస్థాయికి ప్రత్యేక కమిటీ
- ఆ నివేదిక ఆధారంగానే సీడ్ సరఫరా

జిల్లాలో..
మత్స్యపారిశ్రామిక సంఘాలు : 107
ఆయా సంఘాల్లోని సభ్యులు: 5040
మొత్తం చెరువులు : 224
చేప పిల్లల పంపిణీ లక్ష్యం : 1.16కోట్లు
35–40 ఎంఎం సైజ్ : 83 లక్షలు
90–100 ఎంఎం సైజ్ : 33లక్షలు



కైలాస్‌నగర్: కులవృత్తిపై ఆధారపడి జీవించే మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీకి సంబంధించి టెండర్ ప్రక్రియ ముగిసింది. జిల్లాకు అవసరమైన చేప పిల్లలను సరఫరా చేసేందు కోసం కరీంనగర్‌కు చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్ దాఖలు చేశారు. వాటికి మత్స్యశాఖ ఈ నెల 12న ఆమోదం తెలిపింది. త్వరలోనే వారి చేపల చెరువులను పరిశీలించి సరఫరాకు ఉన్న అవకాశాలపై నివేదిక అందించాల్సిందిగా జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ప్రత్యేక కమిటీ త్వరలోనే కరీంనగర్‌లో పర్యటించనుంది. అయితే చేప పిల్లల సరఫరాలో అక్రమాలకు తావు లేకుండా ఉండాలంటే ఈ క్షేత్రస్థాయి పరిశీలనే కీలకం కానుంది. ప్రక్రియ సజావుగా సాగితే ఈ నెలాఖరులోగా చెరువుల్లో చేప పిల్లలను వదిలే అవకాశముంది.

రెండు బిడ్లు దాఖలు..

జిల్లాలో ఈ ఏడాదికి గాను కోటి 16లక్షల చేప పిల్లలను ప్రాజెక్టులు, చెరువుల్లో వదిలేలా మత్స్యశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. వీటి సరఫరా కోసం టెండర్లను పిలిచారు. మొదటిసారి కేవలం ఒకే బిడ్ దాఖలైంది. దీంతో మరోసారి ఆహ్వానించగా కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువైంది. ఈ క్రమంలో ఈ ఏడాది చేప పిల్లల సరఫరా ఉంటుందా లేదా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. తిరిగి ఈనెల 12న మూడోసారి టెండర్లు పిలువగా మరో బిడ్ దాఖలైంది. మొత్తంగా జిల్లాకు అవసరమైన చేప పిల్లలను సరఫరా చేసేందుకు కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లు బిడ్లను దాఖలు చేయగా మత్స్యశాఖ వాటికి ఆమోదం తెలిపింది. ఈనెల 16లోపు క్షేత్రస్థాయిలో వారికి సంబంధించిన చేపల చెరువులను ప్రత్యేక కమిటీ పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించింది. అయితే వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో పరిశీలన కమిటీ ఇంకా నియామకం కాలేదు. కమిటీ నియామకమైన తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంది. సదరు కాంట్రాక్టర్లు టెండర్‌లో చెప్పినట్లుగా చేపల చెరువులు ఉన్నాయా, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి, అందులో చేప పిల్లలు ఉన్నాయా, జిల్లాకు సరిపడా వారు సరఫరా చేయగలుగుతారా అనే విషయాలను పరిశీలిస్తుంది. వారిచ్చే నివేదిక ఆధారంగానే ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌కు సీడ్ సరఫరాకు అనుమతి ఇవ్వనున్నారు.

పారదర్శకంగా వ్యవహరిస్తాం

చేపల చెరువుల పరిశీలనకు ప్రత్యేక కమిటీ నియమించాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీని సోమవారం ఏర్పాటు చేస్తాం. మంగళ, బుధవారాల్లో కరీంనగర్‌లో పర్యటించి టెండర్ దాఖలు చేసిన కాంట్రాక్టర్ల చెరువులు, చేప పిల్లల నిల్వ, సరఫరా సామర్థ్యం వంటి అంశాలను క్షేత్రస్థాయికి వెళ్లి పక్కాగా పరిశీలిస్తాం. పారదర్శకమైన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. ఆరోగ్యకరమైన సీడ్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా మత్స్యకారులకు న్యాయం జరిగేలా చూస్తాం.

– టి.భాస్కర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్



మాట్లాడుతున్న దామోదర్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం ముందుండి పోరాటం చేస్తుందని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్రఅధ్యక్షుడు పుల్గం దామోదర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పక్షం రోజుల్లో నూతన హెల్త్ కార్డులను ప్రభుత్వం జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింహాస్వామి, డీసీఈబీ కార్యదర్శి కందుల గజేందర్, సంఘ బాధ్యులు గోవర్ధన్, భాస్కర్, రవీందర్, శశికళ, కిషన్, లక్ష్మి, శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

[illegible] అరెస్ట్



అంబులెన్స్‌లో ప్రసవం

[illegible] గాపూర్ పంచాయతీ పరిధి కొలాంగూడకు చెందిన దుర్వా రు [illegible] 108 అంబులెన్స్‌లో ప్రసవ [illegible]

వాగులో చిక్కుకున్న గొర్రెలమంద



గొర్రెలను వాగు దాటిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: [illegible] ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి [illegible]

వికటించిన నాటువైద్యం.. ముగ్గురిపై కేసు

బోథ్: మహిళకు నాటు వైద్యం వికటించడం, ఇందుకు కారణమైన ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సొనాల మండలం గొల్లాపూర్ సమీపంలో పంచముఖి హనుమాన్ నిర్వాహకులు చందర్‌సింగ్, పెందూరి మనోహర్, సోయం సతీశ్‌కుమార్‌లు ఆకులపసరుతోపాటు పలు పసురులతో గత కొంత కాలంగా నాటువైద్యం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మిలుకూరి జ్యోతి వీరి వద్ద గతంలో ఆకుపసరుతో నాటు వైద్యం చేయించుకున్నారు. చందర్ సింగ్‌తోపాటు మరో ఇద్దరు మహిళ నడుముపై తన్నడంతో ముఖ్యమైన భాగాల డిస్కులు పగిలిపోయాయి. దీంతో నడవలేని స్థితికి చేరింది. కాగా, నాటువైద్యం కోసం ముగ్గురు రూ.1.70 లక్షలు తీసుకున్నట్లు జ్యోతి తెలిపింది. జ్యోతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆగని నెత్తుటి త్యాగాల ధార జోహార్ వెంకటి

- విప్లవోద్యమంలో అసువులు బాస్తున్న బెల్లంపల్లి బిడ్డలు
- ప్రజల కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పిస్తున్న వైనం
- నిరుపేద, కార్మిక కుటుంబాల వారే..



బెల్లంపల్లిలో నిర్మించిన పీపుల్స్‌వార్ అమరుల స్మారక స్థూపం



పెద్ది శంకర్ (ఫైల్)



గంగారాం (ఫైల్)



సుదర్శన్ (ఫైల్)



గెల్లి రాజలింగు (ఫైల్)



గజ్జెల సరోజ (ఫైల్)



జాడి వెంకటి (ఫైల్)

బెల్లంపల్లి: విప్లవోద్యమ చరిత్రలో బెల్లంపల్లికి ఎంతో ప్రత్యేకత ఉంది. పోరాటాల పురిటిగడ్డగా ప్రసిద్ధిగాంచింది. బొగ్గు గనుల క్షేత్రమైన ఈ ప్రాంతం నుంచి ఎందరో యువకులు విప్లవోద్యమంలో చేరి ఏళ్ల తరబడి నుంచి అసువులు బాస్తున్నారు. నేటికీ అదే ఒరవడి కొనసాగుతోంది. విప్లవమే జీవితాశయంగా ఎంచుకుని సాయుధ గెరిల్లా పోరాట పంథాలో సాగుతూ పోలీసు ఎదురుకాల్పులు, అనారోగ్య సమస్యలతో ఒక్కొక్కరుగా కన్నుమూస్తున్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తూ త్యాగాలకు మారుపేరుగా నిలుస్తున్నారు. ఆ అమరుల నెత్తుటి త్యాగాలతో నల్ల నేల ఎరుపు వర్ణాన్ని పులుముకుంటోంది. అజ్ఞాతంలోకి వెళ్లి దండకారణ్యానికి ఉద్యమబాటలు వేసిన విప్లవకారుల్లో ఈ ప్రాంత అమరుల భాగస్వామ్యం ఎంతో ఉంది. త్యాగాల నెత్తుటి సాళ్లలో మొలకెత్తిన ఆ విప్లవ బీజాలు ప్రస్తుతం కానరాకుండా పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

దౌర్జన్యాలు, దాష్టీకాలు సహించలేక..

విప్లవ పోరాటానికి ఆకర్షితులైన యువకుల్లో అత్యధిక మంది నిరుపేద, కార్మిక బిడ్డలే. సింగరేణి కార్మికులపై గని అధికారులు సాగిస్తున్న వేధింపులు, దోపిడీ, దౌర్జన్యాలు, అట్టడుగు వర్గాల ప్రజలు, బస్తీల్లో మహిళలపై గూండాలు సాగిస్తున్న దాష్టీకాలకు వ్యతిరేకంగా తిరగబడ్డారు. ప్రజాకంటకులుగా మారిన గూండాలు, రౌడీలను అంతమొందించి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) తరఫున గని అధికారుల దోపిడీ, దౌర్జన్యాలు ఎదిరించి విప్లవమార్గంలో పయనించారు. పీపుల్స్‌వార్, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) నిర్మాణంలో కార్మిక, నిరుపేద వర్గాల బిడ్డలు భాగస్వాములై రహస్య జీవితంలోకి వెళ్లారు.

ఆద్యులు ఆ ముగ్గురు

సింగరేణి కార్మిక బిడ్డలైన గజ్జెల గంగారాం, పెద్ది శంకర్, కటకం సుదర్శన్ విద్యార్థి దశలో రాడికల్ విప్లవోద్యమాలకు ఆకర్షితులయ్యారు. విప్లవోద్యమ చరిత్రలో వీరు ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నారు. వీరి అడుగుజాడల్లో ఎందరో యువకులు పోరు బాటపట్టారు. దశాబ్దాలుగా రహస్య జీవితం గడుపుతూ ఎన్‌కౌంటర్‌లో అమరులవుతున్నారు. ఎక్కడ జరిగిన అక్కడ బెల్లంపల్లి బిడ్డ ఎవరో ఒకరు నేలకొరగడం ఈ ప్రాంత ప్రజలను, విప్లవ సానుభూతిపరులను తీవ్రంగా కలిచివేస్తోంది.

తొలి అమరుడు పెద్ది శంకర్

బెల్లంపల్లి విప్లవకారుల్లో తొలి అమరుడిగా పెద్ది శంకర్ చరిత్ర పుటలకెక్కారు. 1980లో మహారాష్ట్రలోని సిరోంచ తాలూకా మోయిన్‌బిన్‌పేట వద్ద జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో ఆయన మృతి చెందాడు. ఆయుధాలను పరీక్షిస్తుండగా వరంగల్, కరీంనగర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో గ్రేనేడ్ పేలి 1981లో గజ్జెల గంగారాం అమరుడయ్యాడు. 1985లో పులి మధునయ్య సిర్పూర్ తాలూకా లోడ్‌పల్లి వద్ద, 1987లో బుయ్యారం వద్ద ముద్దు నారాయణ, ఈట శంకర్, మురళి, 1999లో నస్పూర్ కాలనీలో సికాస అగ్రనేత గెల్లి రాజలింగు, 2000లో తిర్యాణి మండలం లోవగుట్ట వద్ద ఇద్దరు ఆదివాసీ దళసభ్యులతోపాటు శనిగారపు రాంచందర్, 2002లో పులిపాక లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లో పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. గజ్జెల గంగారాం సోదరి గజ్జెల సరోజ దండకారణ్యంలో అనారోగ్యంతో 2013లో అమరురాలైంది. అంచెలంచెలుగా మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడి స్థాయికి ఎదిగిన కటకం సుదర్శన్ 2023 మే 31న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దక్షిణ్ బస్తర్ అడవుల్లో అనారోగ్య సమస్యలతో కన్నుమూశాడు. 2024లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కాసరవేణి రవి మృతి చెందగా తాజాగా ఈనెల 11న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన జాడి వెంకటి అసువులు బాశాడు.

- అశ్రునయనాల మధ్య చంద్రవెల్లిలో అంత్యక్రియలు
- భారీగా తరలివచ్చిన జనం
- నివాళులర్పించిన నాయకులు, ప్రజలు



వెంకటికి తల కొరివి పెడుతున్న చెల్లెలు సుజాత



కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబీకులు

బెల్లంపల్లిరూరల్: ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ అటవీ ప్రాంతంలో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టు ఒడిశా (ఏవోబీ) రాష్ట్ర టెక్నికల్ టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడి వెంకటి అలియాస్ విమల్ అలియాస్ సురేష్ అలియాస్ మంగన్న (56) అంత్యక్రియలు ఆదివారం చంద్రవెల్లిలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. గ్రామ శివారు చేరుకున్న మృతదేహానికి నివాళులర్పించేందుకు ప్రజాసంఘాలు, అమరవీరుల బంధుమిత్రుల సంఘం, వివిధ పార్టీల నాయకులు, జనం భారీగా తరలివచ్చారు. ఎర్రని జెండాతో బాణాసంచా కాల్చుతూ విప్లవ గీతాలు పాడుతూ నృత్యాలు చేస్తూ స్వగృహానికి తీసుకువచ్చారు. సంఘాల నాయకులు మృతదేహం వద్ద ఎర్రని జెండా కప్పి, పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. మృతదేహాన్ని చూసి కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామ శివారులోని వెంకటికి చెందిన స్థలం వరకు అంతిమయాత్ర చేపట్టారు. అమరుడా లాల్ సలామ్, జోహార్ కామ్రేడ్ వెంకటి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చెల్లెలు రామటెంకి సుజాత అన్న వెంకటికి తలకొరివి పెట్టింది. అమరవీరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి, కార్యదర్శి శాంతక్క, సభ్యులు సత్తక్క, కవిత, అనిత, రైతు హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి రామడగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు వెంకటస్వామి, పూర్ణిమ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చాంద్‌పాషా, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్, మాజీ జెడ్పీటీసీ రాంచందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, కాంగ్రెస్ నాయకులు శంకర్, స్వామి, ప్రజా కళా మండలి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆడెపు సమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, అభిమానులు ఆయనకు విప్లవ జోహార్లు అర్పించారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

ఆపరేషన్ కగార్ పేరిట బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే నిలిపివేయాలని అమవీరుల బంధుమిత్రల కమిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి, రాష్ట్ర కార్యదర్శి శాంతక్క డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్‌పై కేంద్రప్రభుత్వం సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదన కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు.

అంబులెన్స్‌కు దారి కష్టాలు



గడ్చిరోలి అటవీ ప్రాంతంలో బురదలో దిగబడిన అంబులెన్స్

బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం జాడి వెంకటి మృతదేహాన్ని తీసుకురావడానికి వెళ్లిన అంబులెన్స్‌కు దారి కష్టాలు ఎదురయ్యాయి. బంధువులు వెంకటస్వామి, జనార్దన్, గ్రామస్తుడు దామోదర్‌గౌడ్‌లు శనివారం రాత్రి వెంకటి మృతదేహంతో చంద్రవెల్లికి తిరుగుపయనమయ్యారు. ఆదివారం తెల్లవారుజాము మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అటవీ ప్రాంతంలో బురదలో చిక్కుకుంది. రెండు గంటలు శ్రమించిన బయటకు రాకపోవడంతో కిలోమీటరు దూరాన గ్రామానికి చేరుకుని ఓ ట్రాక్టర్‌ను, కొంతమందిని తోడ్కొని వచ్చి బయటకు తీశారు. వార్ధా నది బ్రిడ్జి పై నుంచి నీటి ఉధృతి కారణంగా వెనక్కి మళ్లీ మరో దారిని ఎంచుకున్నారు. కుమురం భీం జిల్లా బెజ్జూరుకు అక్కడి నుంచి కౌటాల, కాగజ్‌నగర్ మీదుగా సాయంత్రం 4 గంటలకు చంద్రవెల్లికి చేరుకున్నారు. అమరుల బంధుమిత్రుల కమిటీ శ్రేణులు, గ్రామస్తులు, బంధువులు ఊరి పొలిమేరల నుంచి వెంకటి మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో ఆదిలాబాద్ సత్తా



జిల్లా జట్టు క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

- బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో జిల్లా జట్టు
- జనగామ జిల్లాలో ముగిసిన పోటీలు

జఫర్‌గఢ్: జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి 44వ సబ్ జూనియర్ ఇంటర్‌షిప్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలికల విభాగంలో మెదక్ జట్టు మొదటి స్థానం, ఖమ్మం ద్వితీయ, వరంగల్ తృతీయ, ఆదిలాబాద్ జట్లు నాలుగో స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఆదిలాబాద్ ప్రథమ, నల్లగొండ ద్వితీయ, కరీంనగర్ తృతీయ, నిజామాబాద్ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదెపాక అయోధ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు జయాకర్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి రమణ హాజరై మాట్లాడారు. దేశంలో క్రీడలు, క్రీడాకారులకు గుర్తింపు ఉందన్నారు. మారుమూల ప్రాంతమైన కూనూర్‌లో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ బాధ్యులు నారాయణరెడ్డి, వీరభద్రరావు, రవీందర్ కుమార్, వీరయ్య, కమల్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

‘చలో భద్రాచలం’ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సోయం బాపూరావు

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 28న నిర్వహించే చలో భద్రాచలం కార్యక్రమాన్ని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని 9 తెగల ఆదివాసీలు విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివాసీ సంఘాల రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సోయం బాపూరావు, జిల్లాకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొని చలో భద్రాచలం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోయం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ జేఏసీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ, ఆ తర్వాత ఢిల్లీలో సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో 9 తెగల సంఘాల నాయకులు, అడ్వొకేట్, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామం 61వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయయ్యాయి. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. భైంసా పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన రోహిత్ (21), చంద్రకాంత్‌లు బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో అతివేగంగా, జాగ్రత్తగా నడుపుతూ నిలిపి ఉన్న ఎడ్లబండిని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో రోహిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు 108 వాహనంలో నిర్మల్ తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు. చంద్రకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

బైక్ దొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో బైక్ దొంగలించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. పట్టణానికి చెందిన నిసార్ హుస్సేన్ తన ఆరోగ్యం బాగాలేకపోవడంతో శనివారం రిమ్స్‌లో వైద్యం కోసం వెళ్లి బైక్‌ను పార్కింగ్ చేశాడు. తిరిగివచ్చేసరికి బైక్ కనిపించలేకపోవడంతో బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన విజయ్‌కుమార్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

దాడి ఘటనలో ఐదుగురు అరెస్ట్

తాండూర్: మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి సృజన్‌గౌడ్‌పై దాడి చేసిన ఘటనలో ఐదుగురి యువకులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 5న రాత్రి తాండూర్ ఐబీలో తనపై దాడి చేసి గాయపర్చారని సృజన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు సుభద్ర కాలనీకి చెందిన అనిల్, సాయి, రాజు, నరేశ్, హరిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నిఖిల్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

ప్రాజెక్టులో మునిగి ఒకరి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం సమీపంలోని చెక్‌డ్యాం వద్ద పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో మునిగి పవార్ రాజు(36) మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహాగాం గ్రామానికి చెందిన పవార్ రాజు గత నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు బంధువులు, తెలిసినవారి వద్ద వెతికిన ఆచూకీ దొరకలేదు. కోతల్‌గాం సమీపంలోని చెక్‌డ్యాం వద్ద ప్రాజెక్టు వాటర్‌లో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. భార్య కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు..



గాయపడిన తిరుపతి, కృష్ణకుమార్

రెబ్బెన: మండలంలోని వంకులం సమీపంలో పెద్దవాగు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం రాపెల్లికి చెందిన సునార్కర్ ఆనంద్‌రావు (47) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం కాగజ్‌నగర్ నుంచి బైక్‌పై రాపెల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరోబైక్‌పై ప్రయాణిస్తున్న ఎన్నం తిరుపతి, ఎన్నం కృష్ణకుమార్‌కు గాయాలు కాగా ప్రైవేటు వాహనంలో కాగజ్‌నగర్ తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య సురేఖ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు..



మృతిచెందిన సుకులాల్ యాదవ్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి యాపల్ ప్రాంతంలోని జీఎం ఆఫీస్ సమీపంలో ఆదివారం విద్యుత్ షాక్‌తో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సుకులాల్ యాదవ్ (31) మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. నాలుగేళ్ల క్రితం సుకులాల్ కుటుంబంతో జీవనోపాధి కోసం మందమర్రికి వచ్చారు. కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పనికి వెళ్లడానికి వేడి అన్నం పెట్టుకున్నాడు, చల్లార్చుకోడానికి కూలర్ స్విచ్ ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. సమీపంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. సుకులాల్ మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్ తరలించేందుకు హిందూ శ్మశాన వాటిక కేకే–ఓసీ కమిటీ సభ్యులు విరాళాలు సేకరించి రూ.70 వేలను కుటుంబసభ్యులకు అందించారు.

అ‘పూర్వ’ కలయిక



50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు, గురువులు

మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1973–74 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన వారందరూ ఒకేచోట కలుసుకుని ఆనందంగా గడిపారు. వీరి అపూర్వ కలయికకు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. చదువు నేర్పిన గురువులు నర్సయ్య, కాంతయ్య, డి.నారాయణరావు, ఎస్.సూర్యనారాయణలను సన్మానించారు. పూర్వవిద్యార్థులు మంగీలాల్‌సోమాని, గుండా సుధాకర్, అనిల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, జుబేర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. – మంచిర్యాలఅర్బన్

ఇద్దరు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనోక్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని గురిజాల రైతువేదికలో జూలై 3న జరిగిన చోరీని పోలీసులు ఛేదించారు. ఎట్టకేలకు రెండు నెలలకు దొంగలను పట్టుకున్నారు. పోలీసుస్టేషన్‌లో బెల్లంపల్లి రూరల్ సీఐ చందవోలు హనోక్ ఆదివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. గురిజాల రైతు వేదికలో రూ.1.90 లక్షల విలువ గల వీడియో కాన్ఫరెన్స్‌కు ఉపయోగించే ఎల్ఈడీ టీవీ, ఇతర సామగ్రి చోరికి గురైనట్లు వ్యవసాయ అధికారులు తాళ్లగురిజాల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు. కన్నెపల్లి మండలం జన్కాపూర్‌కు చెందిన మహమ్మద్ నసీమ్ బేగ్, బెల్లంపల్లి అశోక్‌నగర్‌కు చెందిన వర్మ శైలేష్‌లు జూలై 3న అర్ధరాత్రి ఆటోలో వచ్చి బండరాయితో తాళం పగులగొట్టి ఎల్ఈడీ టీవీ, సౌండ్ బాక్స్‌లు, సీపీయూ, ఆంప్లీఫయార్, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఆ సామగ్రిని బెల్లంపల్లిలో విక్రయించేందుకు వస్తున్నారు. తాళ్లగురిజాల పోలీసులు శనివారం వాహనాల తనిఖీలో ఆటోలో ఎల్ఈడీ టీవీ, సామగ్రి అనుమానస్పదంగా కనిపించడంతో సదరు వ్యక్తులను అదుపులో తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఇద్దరు నిందితులను బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తాళ్లగురిజాల ఎస్సై బండి రామకృష్ణ, ఏఎస్సై అలీ, సిబ్బంది అరుణ్, మురళీ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్



బంధించిన కొండచిలువ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ చౌరస్తా సమీపంలో శనివారం అర్ధరాత్రి 9 అడుగుల భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో కనిపించడంతో వాహనదారులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని కొండచిలువను బంధించే ప్రయత్నం చేశారు. స్నేక్ క్యాచర్ అనిల్ చాకచక్యంగా కొండచిలువను బంధించాడు. వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వచ్చి ఉంటాయని భావిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



కొంపెల్లి నర్సయ్య (ఫైల్)

దస్తురాబాద్: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. మండలంలోని గోడిసీర్యాల గ్రామానికి చెందిన కొంపెల్లి నర్సయ్య(45) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొన్నిరోజుల క్రితం పెద్దకుమార్తెకు వివాహం చేయడంతో కుటుంబంలో తగాదాలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో శనివారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.